క్లుప్తంగా

బడి ఈడు పిల్లలను పాఠశాలలో చేర్పించండి



తాళ్లూరులో గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

గండేపల్లి: బడి ఈడు పిల్లలను పాఠశాలలో చేర్పించాలని ఎంఈఓ–2కే వెంకటరెడ్డి గ్రామస్తులకు తెలియజేశారు. తాళ్లూరులో సోమవారం ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహించి కరపత్రాలు పంపిణీ చేసి, పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 5 సంవత్సరాలు దాటిన అంగన్‌వాడీ కేంద్రాలలోను, ఆరుబడట పిల్లలను గుర్తించి ప్రభుత్వ పాఠశాలలో చేర్పించడంపై నిర్వహించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూల్ టీచర్స్ కె.గోవింద్, పి.మాధవి, డి.అప్పారావు, అంగన్‌వాడీ కార్యకర్త వి.వెంకటలక్ష్మి, ఐఆర్‌టీ టీచర్, ఎస్ఎంసీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆదిత్యలో ప్రొఫెషనల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం

గండేపల్లి: సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో ప్రొఫెషనల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంను సోమవారం ప్రారంభించినట్టు డిప్యూటీ ప్రో చాన్సలర్ ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు. యూనివర్సిటీ ఫ్రెష్ మ్యాన్ ఇంజినీరింగ్ విభాగంలో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ టీచర్స్ ట్రైనింగ్ అండ్ రీసెర్చ్ సౌజన్యంతో ఫౌండేషన్ ఆఫ్ టీచింగ్ అండ్ లెర్నింగ్ అనే అంశంపై ఐదు రోజుల పాటు ఈ ప్రోగ్రాం జరుగుతుందన్నారు. ఉపాధ్యాయ వృత్తిలో అవసరమైన మెళకువలు, విద్యార్థుల మానసిక స్థితికి అనుగుణంగా అధ్యాపకులు వృత్తి నైపుణ్యాలు అభివృద్ధి చేసుకునేందుకు దోహదపడుతుందన్నారు.

ప్లేట్‌లెట్స్ తగ్గితే ప్రమాదం



జి.కొత్తపల్లిలో రోగులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యురాలు సౌమ్యశ్రీ

శంఖవరం: డెంగీ వ్యాధి కారణంగానే ప్లేట్‌లెట్స్ తగ్గి పోతాయని పి.మల్లాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి సౌమ్యశ్రీ తెలిపారు. జి.కొత్తపల్లి గ్రామంలో ప్రజలకు వ్యాధులపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ ఏడిస్ దోమ కుట్టడం వలన డెంగీ వస్తుందని, ఈ దోమ పగటి పూట కుడుతుందన్నారు. డెంగీ వ్యాధికి ప్రత్యేక చికిత్స అంటూ ఏమి లేదు. లక్షణాలకనుగుణంగా చికిత్స పొందాలన్నారు. ఒళ్లు నొప్పులు, కాళ్ల లాగడం, వాంతులు, చలితో కూడిన జ్వరం, పళ్ల చిగుళ్ల నుంచి రక్తం కారడం వంటి లక్షణాలు కనిపిస్తాయన్నారు. ఆ లక్షణాలు ఉన్నవారు వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. దోమల నియంత్రణకు దోమల తెరలు, మస్కిటో కాయిల్స్ ఉపయోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఏపీఈఏపీ సెట్‌-2025 పరీక్షలు

గండేపల్లి: సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో సోమవారం ప్రారంభమైన ఏపీఈఏపీ సెట్–2025 పరీక్షలు మొదటి రోజు ప్రశాంతంగా జరిగినట్టు యూనివర్సిటీ ప్రో ఛాన్సలర్ ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు. జేఎన్‌టీయూకే యూనివర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న (ఆంధ్రప్రదేశ్ ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్) ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, రెండో సెషన్ మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయింత్రం 5 గంటల వరకు జరిగాయని, 1072 మందికి 1000 మంది పరీక్షలు రాసినట్టు పేర్కొన్నారు. పరీక్షలకు చీఫ్ సూపరింటెండెంట్‌గా ప్రో వైస్ ఛాన్సలర్ ఆదిరెడ్డి రమేష్, ఎం.రాజబాబు, టి.శ్రీనివాసులు, వీరప్రసాద్ కో ఆర్డినేటర్లు వ్యవహరించారన్నారు.

ఆలస్యమైనా ఎన్నికల హామీలు అమలు చేస్తాం



అన్నవరంలోని మహానాడులో పాల్గొన్న ఎమ్మెల్యే సత్యప్రభ, మాజీ మంత్రి యనమల తదితరులు

అన్నవరం: కొంత ఆలస్యం అయినా ఎన్నికల్లో ఇచ్చిన హామీలు సూపర్ సిక్స్ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తుందని మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు తెలిపారు. ప్రత్తిపాడు నియోజకవర్గ టీడీపీ మహానాడు స్థానిక హరిహర రిసార్ట్స్‌లో సోమవారం సాయంత్రం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా మాజీ మంత్రి యనమల, పార్టీ పరిశీలకునిగా మెట్ల రమణ బాబు హాజరయ్యారు. సమావేశంలో పార్టీ ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్, నాయకులు పాల్గొన్నారు.

దూడల సంరక్షణ ఇలా..



టి.రాయవరంలో దూడకు టీకా వేస్తున్న పశువైద్య సిబ్బంది



దూడకు డీవార్మింగ్ చేస్తున్న పశువైద్య సిబ్బంది

- పుట్టిన దూడకు జున్నుపాలు పట్టించాలి
- పశువులశాలలో పరిశుభ్రత అవసరం
- సూచనలు పాటించాలంటున్న పశువైద్యులు

ప్రత్తిపాడు: మనము పశువులతోపాటు దూడలను కూడా సంరక్షించాలని పశువైద్యులు చెబుతున్నారు. వాటి సంరక్షణకు సరైన సూచనలు సలహాలు పాటించాలన్నారు. దూడలకు బలవర్ధక ఆహారం ఇస్తే బలీయమైన పశువులుగా ఎదుగుతాయి. పాలిచ్చే ఆవులు, గేదెల పొదుగులో పాలన్నీ సేకరించడం వల్ల దూడలకు పాలు లేక వాటిలో వ్యాధి నిరోధక శక్తి లోపించి, నీరసించిపోతుంటాయి. వాటిని సరిగ్గా పెంచకపోతే మరణించే ప్రమాదం ఉంది. పుట్టిన ప్రతి దూడను ఆరు నెలల లోపు సమీప పశు వైద్యాధికారిని సంప్రదించి, చెవి పోగు వేయించి, రిజిస్టర్ చేయించుకోవాలి. దూడలు బలంగా ఉండాలంటే ఎటువంటి జాగ్రత్తలు పాటించాలో పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ చిక్కం బాలచంద్ర యోగేశ్వర్ వివరించారు.

నిర్లక్ష్యంగా ఉంటే..

పుట్టిన దూడలకు మొదటి వారం రోజుల వరకు తల్లి పశువు నుంచి రెండు పూటలా జున్ను పాలు పట్టించాలి. ఈ జున్ను పాలు తాగించడంతో దూడల్లో రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. ఈ జున్నుపాలు కూడా పుట్టిన మొదటి 8–12 గంటల లోపు పట్టించాలి. ఇలా చేస్తే దూడలు ఆరోగ్యం ఉండి వ్యాధులు అంత త్వరగా దరిచేరవు. ఆవు లేక గెదె నుంచి పాలు సేకరించేటప్పుడు దూడ కోసం పొదుగులో కొన్ని పాలను వదిలేయాలి. దూడలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఒక్కోసారి అవి మరణించవచ్చు. సాధారణంగా మొదటి మూడు నెలలలో దూడ బరువులో (30 కేజీలు ఉంటుంది) పది శాతం పాలు ఇవ్వవలసి ఉంటుంది. అనగా ఉదయం 1.5 లీటర్లు, సాయంత్రం 1.5 లీటర్ల పాలు ఇవ్వవలసి ఉంటుంది. మూడు నెలల తరువాత దూడ పచ్చగడ్డి మీదకు మళ్లు తుంది కాబట్టి అప్పటి నుంచి పాలు ఇవ్వడం నెమ్మదిగా తగ్గించవచ్చు.

దూడలకు సోకే వ్యాధులు

అతిసార వ్యాధి

అపరిశుభ్రమైన పాత్రలు, షెడ్లలో తడి, బురద ఉండడం, ఆహారాన్ని పరిమితికి మించి పెట్టడంతో అతిసార వ్యాధి సోకుతుంది. దుర్వాసనతో కూడిన నీళ్ల విరేచనాలతో దూడలు నీరసిస్తాయి. బరువు కోల్పోతాయి. 1–3 వారాల దూడలు ఈ వ్యాధికి లోనవుతాయి. అప్పుడు వాటికి వైద్యుడి సలహా మేరకు సల్ఫా, యాంటిబయాటిక్స్, ఐ/వీ ఫ్లూయిడ్స్ ఇస్తూ రీహైడ్రేషన్ రాకుండా చూసుకోవాలి. దూడ పుట్టిన అరగంటలోపు జున్నుపాలు పట్టించాలి. దూడలకు పరిమితికి మించి పాలను పట్టించకూడదు. షెడ్లను పరిశుభ్రంగా, గాలి, వెలుతురు ధారాళంగా వచ్చేటట్లు ఉంచుకోవాలి.

తెల్లపారుడు

కొన్ని రకాల బ్యాక్టీరియాలతో లేగ దూడలకు ఈ వ్యాధి సోకుతుంది. దూడలు విపరీతంగా తెల్లగా పారుతాయి. పారుడుకు ముందు జ్వరం వస్తుంది. ఆకలి మందగిస్తుంది. చర్మం పొడిగా, గరుకు ఉంటుంది. కాళ్ళలో సత్తువ లేక నీరసించిపోతాయి. అప్పుడు సల్ఫా యాంటిబయాటిక్స్, ఐ/వీవి ఫ్లూయిడ్స్ వాడాలి.

రక్త విరేచనాలు

ఎక్కువ పాలు తాగించడంతో సూక్ష్మజీవులు కోక్సిడియా ఆశించి రక్త విరేచనాలు వ్యాధి వస్తుంది. ఈ వ్యాధి సోకిన దూడల మలం రక్తంతో కూడి ఉంటుంది. పశుశాలను శుభ్రంగా ఉంచడంతో పాటు సరైన యాజమాన్య పద్ధతులు పాటించాలి. సల్ఫా, ఏంప్రోలియం యాంటిబయాటిక్స్‌ను వాడుతూ డీహైడ్రేషన్ రాకుండా ఐ/వీ ఫ్లూయిడ్స్ కూడా ఇవ్వాలి.

నిమోనియా (ఊపిరితిత్తుల వ్యాధి)

బ్యాక్టీరియా, వైరస్‌ల ద్వారా ఈ వ్యాధి సోకుతుంది. షెడ్లలో తేమ ఎక్కువగా ఉండడం, చలిగాలుల నుంచి సరైన రక్షణ లేకపోవడంతో ఈ వ్యాధి వ్యాపిస్తుంది. ఈ వ్యాధి సోకిన దూడలకు జ్వరం వచ్చి, శ్వాస ఇబ్బందికరంగా ఉంటుంది. ఆకలి మందగిస్తుంది. కళ్లు, ముక్కు నుంచి నీరు కఫం వస్తుంది. దూడలు ఎక్కువగా చనిపోయే అవకాశం కూడా ఉంది. అప్పుడు పశుశాలలను శుభ్రంగా ఉంచాలి. చలిగాలుల నుంచి దూడలను రక్షించాలి. సల్ఫాతో పాటు లింకోమైసిన్ లాంటి యాంటిబయాటిక్స్‌ను, ఐ/వీ ఫ్లూయిడ్స్ వైద్యుని సలహాతో వాడాలి.

కీళ్ల జబ్బు – బొడ్డు వాపు

దూడ బొడ్డు సంచికి సూక్ష్మ జీవులు ఆశించడంతో ఈ వ్యాధి సోకుతుంది. బొడ్డు నరం సరిగా వేరు చేయనప్పుడు, కత్తిరించడంలో అజాగ్రత్తలతో ఈ వ్యాధి వ్యాపిస్తుంది. దుర్వాసనతో కూడిన చీము కారుతుంది. సూక్ష్మజీవులు కీళ్లకు కూడా వ్యాపించి కీళ్ల వాతం వస్తుంది. ఆ సందర్భంలో పుట్టిన వెంటనే దూడ బొడ్డు నరాన్ని టింక్చర్ అయోడిన్ ముంచిన దూదితో అద్దాలి. బొడ్డు ఊడే వరకు పరిశుభ్రమైన స్థలంలో దూడను ఉంచాలి.

అంతర పరాన్నజీవులు

అనేక రకాల పురుగులు జీర్ణాశయాన్ని, ఊపిరితిత్తులను ఆశించడంతో దూడలు నీరసిస్తాయి. అశ్రద్ధ చేస్తే మరణాలు చోటు చేసుకుంటాయి. ఈ పురుగులు పేడ ద్వారా, నేల, నీటి ద్వారా తిరిగి ఆశిస్తాయి. అప్పుడు దూడలకు ఏలిక పాముల నివారణ మందును 7వ, 15వ, 30వ, 60వ, 90వ రోజులోనూ, ఆ తరువాత నుండి ప్రతీ మూడు నెలలకు ఒకసారి వంతున సంవత్సర కాలం పాటు వేయించా లి. ఆపై ఏ పశువుకైనా సరే... ప్రతీ ఆరు నెలలకు పా ముల మందు వేస్తే దూడ, గేదే ఆరోగ్యం ఉంటుంది.

వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి



దూడ పుట్టిన ఒకటో రోజు ధనుర్వాతం ఇంజక్షన్ ఇప్పించాలి. నాలుగో రోజు ప్రిపలిన్ ఇంజక్షన్, విటమిన్–ఏ ఇప్పించాలి. నాలుగో మాసంలో సంకర జాతి దూడలకు థైలేరియా వ్యాధి నిరోధక టీకా ఇప్పించాలి. ఆరో మాసంలో గొంతు వాపు, జబ్బ వాపు టీకాలు వేయించాలి. ప్రతి పెయ్యి దూడకు కూడా 4–8 నెలల లోపు బ్రూసెల్లోసిస్ టీకాను వేయించాలి. ప్రతి ఆరు నెలలకు గాళ్ల వ్యాధి నిరోధక టీకాలు కూడా వేయించాలి. ఈ టీకాల కోసం పాడి రైతులు తమకు దగ్గరలోని పశువైద్య సిబ్బందిని సంప్రదించాలి.

– డాక్టర్ చిక్కం బాలచంద్ర యోగేశ్వర్, అసిస్టెంట్ డైరెక్టర్, పశుసంవర్ధక శాఖ, ప్రత్తిపాడు

జీఓ నంబర్ 4పై పునరాలోచించాలి



గోకవరం తహసీల్దార్ సాయిప్రసాద్‌కు వినతిపత్రం అందిస్తున్న వీఆర్వోలు

గోకవరం: ప్రభుత్వం జీఓ నంబర్–4 పై పునరాలోచన చేయాలని గోకవరం మండల వీఆర్వోలు డిమాండ్ చేశారు. గోకవరం మండల వీఆర్వోల అసోసియేషన్ అధ్యక్షుడు వీరబ్రహ్మ సత్యనారాయణ ఆధ్వర్యంలో సోమవారం జరిగిన సమావేశంలో ఈ మేరకు ఏకగ్రీవ తీర్మానం చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని గోకవరం ఇన్‌చార్జి తహసీల్దార్ సాయిప్రసాద్‌కు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్లస్టర్ విధానంలో రేషనైలేజేషన్ పేరుతో కొన్ని మార్గదర్శకాలు ఇచ్చారని, రెండు సచివాలయాలను కలిపి ఒక క్లస్టర్‌గా నిర్ణయిస్తూ ఒక సచివాలయానికి ఒక వీఆర్వో మరొక సచివాలయానికి సర్వేయర్‌ను కేటాయిస్తూ ఆదేశాల ఇచ్చారన్నారు. ఈ క్లస్టర్ విధానం వల్ల సుమారు 7500 మంది వీఆర్వోలు మిగులు సిబ్బందిగా ఉన్నారని, వీరిని ఏ శాఖలో సర్దుబాటు చేస్తారో తెలియడంలేదన్నారు. అలాగే ఈ విధానంలో వీఆర్వోలపై అదనపు పని భారం పడి తీవ్ర ఒత్తిడికి గురవుతారన్నారు. దీనిపై ప్రభుత్వం స్పందించి పునరాలోచించాలని కోరారు.

వర్షంతో చల్లబడిన వాతావరణం

తొండంగి: కొద్ది రోజులుగా అధిక ఉష్ణోగ్రతల కారణంగా ఉక్కపోతతో ఉన్న వాతావరణం సోమవారం కురిసిన అకాల వర్షంతో చల్లబడింది. బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తన ద్రోణి ప్రభావంతో రెండు రోజులుగా ఆకాశం మేఘావృతమై పలు చోట్ల వర్షం కురిసింది. చల్లబడిన వాతావరణానికి ప్రజలు సేదతీరారు. కోన ప్రాంతంలో సముద్రతీరంలో సముద్ర అలలు ఎగసిపడుతున్నాయి. ప్రస్తుతం వేట నిషేధం అమలు కావడంతో కేవలం నాటు పడవలపై మాత్రమే మత్స్యకారులు వేటకు వెళ్తున్నారు. ఈ నేపథ్యంలో సముద్రంలో ప్రతికూల వాతావరణంతో మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని తుని మత్స్యశాఖ అభివృద్ధి అధికారి సీహెచ్ ఉమామహేశ్వరరావు తెలిపారు.

శిక్షణ శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలి



ఏలేశ్వరం గ్రంథాలయంలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు



కిర్లంపూడి గ్రంథాలయంలో చిత్రలేఖనం పోటీలో పాల్గొన్న విద్యార్థులు

ఏలేశ్వరం: గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా నిర్వహిస్తున్న శిక్షణ శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలని లైబ్రేరియన్ కవికొండల సత్యనారాయణ అన్నారు. స్థానిక గ్రంథాలయలో ఆయన ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులకు స్టోరీ రీడింగ్, స్టోరీ రైటింగ్‌పై మెళకువలు నేర్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులకు కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థులకు వివిధ కళలు, చిత్రలేఖనం, కథలు రాయడం, చదవడం, స్పోకెన్ ఇంగ్లిష్, మ్యాథ్స్, యోగ తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు

కిర్లంపూడి: మండలంలోని కిర్లంపూడి, వీరవరం, గెద్దనాపల్లి గ్రామాల్లో వేసవి విజ్ఞాన శిబిరాలు కొనసాగుతున్నాయి. స్థానిక శాఖ గ్రంథాలయం లైబ్రేరియన్ డి.మరిడిబాబు ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు, నీతి కథల పఠనం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులు గ్రంథాలయాలను సందర్శించి, పుస్తక పఠనం చేయడం ద్వారా మరిన్ని విషయాలపై పరిజ్ఞానం పొందవచ్చునని మరిడిబాబు తెలిపారు.

దళితుల పేర్లను వెబ్‌ల్యాండ్‌లో నమోదు చేయాలి



తహసీల్దార్ సుభాష్‌కు వినతిపత్రం అందిస్తున్న సీపీఐఎంఎల్ ప్రతినిధులు

కోటనందూరు: కేఈ చిన్నయ్యపాలెంలో అసైన్డ్ భూములు సాగు చేసుకుంటున్న దళితుల పేర్లను వెబ్‌ల్యాండ్‌లో నమోదు చేయాలని సీపీఐఎంఎల్ రాష్ట్ర కమిటీ సభ్యుడు కే జనార్దన్ డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఐఎంఎల్ మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఆ మేరకు నిరసన చేపట్టారు. తహసీల్దార్ టీ సుభాష్‌కు వినతిపత్రం అందజేశారు. కేఈ చిన్నయ్యపాలెంలో 1992లో దళితులకు సీలింగు భూములు ఇచ్చారని, కక్షపూరితంగా ఆ భూములను లాక్కునేందుకు కొన్ని శక్తులు కుట్రలు పన్నుతున్నాయని వివరించారు. సీలింగు భూముల విషయంలో దళితులపై ఘర్షనలు, అల్లర్లు జరిగితే అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. దళితులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐఎంఎల్ జిల్లా కమిటీ సభ్యుడు వి.శివ, గ్రామ సంఘం నాయకులు ముప్పం నూకరాజు, బైపా పర్సయ్య, దారకొండ సీతాపతి, దారకొండ సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల వ్యర్థాలతో ఇబ్బందులు



రావికంపాడు శివారులో పుంతో రోడ్డులో వేసిన పరిశ్రమల రసాయన వ్యర్థాలు

తొండంగి: రావికంపాడు శివారు మామిడి తోటల్లో ఉన్న ప్రైవేటు పరిశ్రమల నుంచి వచ్చే ప్రమాదకర రసాయన వ్యర్థాలతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రావికంపాడు, ఎ.వి.నగరం, పెరుమాళ్లపురం తదితర పరిసర గ్రామాల సమీపంలో పరిశ్రమల్లో వచ్చిన రసాయన వ్యర్థాలను వాహనాలతో తెచ్చి రావికంపాడు రైల్వే స్టేషన్ సమీపంలో పుంత రోడ్డు మామిడి తోటల వద్ద పోస్తున్నారని స్థానిక రైతులు వివరించారు. యాసిడ్ మాదిరిగా వేడిగా ఉన్న వ్యర్థాలతో పుంత రోడ్డులో రాకపోకల సాగించేందుకు రైతులు, ప్రజలు ఇబ్బంది పడుతున్నామన్నారు. రసాయనాల వ్యర్థాల కారణంగా దుర్వాసనతో గాలి, నీరు కలుషితమై ప్రమాదకర వ్యాధులు ప్రబలుతాయని ఆందోళన చెందుతున్నారు. కాలుష్య నియంత్రణ మండలి, పంచాయతీ రాజ్, రెవెన్యూ, తదితర సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఉచిత విద్యకు దరఖాస్తుల ఆహ్వానం

బోట్‌క్లబ్: రోటరీ గోల్డెన్ జూబ్లీ క్లబ్, చేయూత సంస్థ సంయుక్తాధ్వర్యంలో ఒకటి నుంచి ఏడో తరగతి వరకు చేయూత హాస్టల్‌లో ఉచితంగా విద్యనభ్యసించడానికి పిల్లల నుంచి ప్రవేశ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని సంస్థ అధ్యక్షులు మొండి రవికుమార్ సోమవారం విలేకర్లకు తెలిపారు. ఏ ప్రాంతం వారైనా ఈ ఉచిత విద్యకు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉందన్నారు. ఈ నెల 31వ తేదీలోగా దరఖాస్తులను అందజేయాలన్నారు. అనాథ, నిరుపేద పిల్లలకు చదువును చేరువ చేయాలన్న ప్రధానాశయంతో ఉచితంగా విద్య, వసతి, భోజన సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. తల్లిదండ్రులు కోల్పోయిన వారికి తొలి ప్రాధాన్యం, తల్లిని కోల్పోయిన వారికి రెండో ప్రాధాన్యం, తండ్రిని కోల్పోయిన వారికి మూడో ప్రాధాన్యం కల్పిస్తామని చెప్పారు. రాత పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ప్రవేశాలు ఉంటాయన్నారు.

ప్రజలపై విద్యుత్ చార్జీల మోత

- కూటమి ప్రభుత్వంలో ఇబ్బందులు
- మాజీ మంత్రి తోట నరసింహం



జిల్లా కమిటీ ఏర్పాటుపై సమీక్ష నిర్వహిస్తున్న మాజీ మంత్రి తోట నరసింహం

జగ్గంపేట: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజలపై విద్యుత్ చార్జీల భారం మోపుతోందని, దీంతో పేద, సామాన్య మధ్య తరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని మాజీ మంత్రి, జగ్గంపేట నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జీ తోట నరసింహం అన్నారు. జగ్గంపేట పార్టీ కార్యాలయంలో సోమవారం నియోజకవర్గ పార్టీ నేతలు, కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చకపోగా ప్రజలను అన్ని విధాల ఇబ్బందులకు గురిచేస్తోందని అన్నారు. తాము అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచమని చెప్పి, ఇప్పుడు విద్యుత్ బిల్లులు చూసి ప్రజలు బెంబేలెత్తిపోతున్నారని విమర్శించారు. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కొన్ని వర్గాలకు విద్యత్ రాయితీలు ఇచ్చారని అవి కూడా కూటమి ప్రభుత్వానికి అమలు చేయడానికి ఇష్టం లేదని అన్నారు. జగన్ హయాంలోనే కరెంట్ చార్జీలు తక్కువగా ఉన్నాయని అన్నారు.

జిల్లా కార్యవర్గం ఏర్పాటుపై సమీక్ష

జగ్గంపేట పార్టీ కార్యాలయంలో వైఎస్సార్ సీపీ మేధావి వర్గం జిల్లా కార్యవర్గం ఏర్పాటు పై సమీక్ష నిర్వహించినట్టు తోట నరసింహం తెలిపారు. మేధావి వర్గం జిల్లా అధ్యక్షుడిగా గండేపల్లి మండలం గోపాలపురానికి చెందిన అవసరాల పార్థసారథిని పార్టీ ఎంపిక చేసిందని చెప్పారు. దీనికి సంబంధించి జిల్లాలోని ప్రతి నియోజకవర్గం నుంచి కమిటీ సభ్యులను ఎంపిక చేశామన్నారు. ఈ కార్యక్రమంలో యువనేత తోట రాంజీ , జగ్గంపేట మండల పార్టీ అధ్యక్షులు రావుల గణేష్‌రాజా,పార్టీ నేతలు, అవసరాల పార్థసారథి,కరుటూరి వీర్రాజు,రామకుర్తి మూర్తి,నియోజకవర్గానికి చెందిన పార్టీ నేతలు పాల్గొన్నారు.

ఎయిడ్స్ నిర్మూలనపై కళాజాతా

జగ్గంపేట: గ్రామంలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఎయిడ్స్ వ్యాధి నిర్మూలనపై ప్రజలకు అవగాహన కల్పించడం కోసం స్థానిక బస్టాండ్‌లో కళాజాతా నిర్వహించారు. హెచ్ఐవీ వ్యాధి ఎలా వ్యాపిస్తుంది, దీని బారిన పడకుండా ఎలాంటి జాగ్రత్తలు పాటించాలి, హెచ్ఐవీ సోకితే ఎలాంటి సమస్యలు వస్తాయి, ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ఎలాంటి జాగ్రత్తలు పాటించాలన్న అంశాలను కళాజాతాలో ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో వైద్యఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉషు చాంపియన్‌షిప్‌లో బంగారు పతకం



ఉషు చాంపియన్‌షిప్‌లో బంగారు పతకం సాధించిన లోవరాజును సత్కరిస్తున్న కలెక్టర్ షణ్మోహన్

కరప: 12వ ఏపీ స్టేట్ ఉషు చాంపియన్‌షిప్ సీనియర్ టోర్నమెంట్‌లో కరప మండలం జి.భావారం గ్రామానికి చెందిన యు.లోవరాజు 80 కిలోల విభాగంలో బంగారు పతకం సాధించాడు. కర్నూలులో ఈ నెల 12 నుంచి 14వ తేదీ వరకు ఈ పోటీలు జరిగినట్టు లోవరాజు తెలిపారు. కాకినాడ కలెక్టరేట్‌లో సోమవారం కలెక్టర్ షణ్మోహన్‌ను లోవరాజు కలవగా ఆయన అభినందించారు. తనను జాతీయ స్థాయి పోటీలకు జిల్లా ఉషు సంఘం ఎంపిక చేసినట్టు లోవరాజు తెలిపారు. విజేతను డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ బి.శ్రీనివాసకుమార్, జిల్లా ఉషు సెక్రటరీ ఆర్.సుందరం, స్టేట్ సెక్రటరీ బి.నరసింహారావు, జి.భావారం సర్పంచ్ రొక్కాల గణేష్ తదితరులు అభినందించారు.

విద్యుత్ ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలి



కలెక్టర్‌కు సమస్యలు వివరిస్తున్న రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీరబాబు

ఏలేశ్వరం: ప్రత్తిపాడు నియోజకవర్గంలో అప్రకటిత విద్యుత్ కోతలతో ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న విద్యుత్ ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలని జైభీమ్‌రావ్ భారత్‌పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, నియోజకవర్గ ఇన్‌చార్జి దాడిశెట్టి వీరబాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు కాకినాడలో సోమవారం జరుగుతున్న స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ షన్మోహన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వీరబాబు మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగులు ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా విద్యుత్‌కోతలు విధిస్తున్నారని ఆరోపించారు. నిర్లక్ష్యంగా విధులు నిర్వర్తిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. జాతీయ రహదారి మీదుగా అక్రమంగా తరలిస్తున్న పశువుల ముఠా వ్యక్తులను అరెస్టు చేయాలని కోరారు. పశువుల ముఠాపై కఠినచర్యలు తీసుకొని మూగజీవాలను కాపాడాలని వీరబాబు కోరారు. ఈ రెండు అంశాలపై కలెక్టర్ సానుకూలంగా స్పందించనట్టు వీరబాబు తెలిపారు.

విద్యార్థి మిత్ర కిట్ల పరిశీలన



కోటనందూరులో విద్యార్థి మిత్ర కిట్లను పరిశీలిస్తున్న సీఎంఓ నాగేశ్వరరావు, ఏఎంఓ జోగిరెడ్డి

కోటనందూరు: స్థానిక ఎంఈఓ కార్యాలయాన్ని సమగ్ర శిక్ష సీఎంఓ చామంతి నాగేశ్వరరావు, ఏఎస్ఓ, ఏఎంఓ కే జోగిరెడ్డి సోమవారం సందర్శించారు. కార్యాలయానికి చేరుకున్న సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్లలో భాగంగా వచ్చిన అచ్చు, నోటు, డిక్షనరీలను పరిశీలించారు. విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్, చేరుకున్న కిట్లు తదితర వివరాలను ఎంఈఓ ఎం.రామశేఖర్‌ను అడిగి తెలుసుకున్నారు. ప్రతి విద్యార్థికి సకాలంలో కిట్లు అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం కార్యాలయ రికార్డులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీ శేఖర్, సిబ్బంది లోవరాజు, నాగేశ్వరరావు, మణేష్ తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో విద్యార్థులకు పుస్తకాలు

తుని రూరల్: ఈ విద్యా సంవత్సరంలో పాఠశాలలు తెరిచే నాటికి విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు అందించేందుకు చర్యలు తీసుకున్నట్టు సమగ్ర శిక్ష సీఎంఓ చామంతి నాగేశ్వరరావు తెలిపారు. మండల విద్యా వనరుల కేంద్రానికి చేరిన సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్లను ఏఎస్ఓ కె.జోగిరెడ్డితో కలసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవసరానికి అనుగుణంగా కిట్లు అందిస్తామన్నారు. మండలంలో జరుగుతున్న చేరికలపై ఎంఈఓ గీతాదేవిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. పార్ట్ బోధకులతో సమావేశమైన ఆయన ఎస్ఆర్‌కేవీఎంపై సూచనలు చేశారు. రెండవ ఎంఈఓ రామకృష్ణ పాల్గొన్నారు.